
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
మంగళవారం 25 ఫిబ్రవరి 2025





ప్రజావాణిలో బారులు తీరిన ప్రజలు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలి

సమస్యలు పరిష్కరించాలని ఒక రోజు వంట బంద్

చలో కలెక్టరేట్‌కు తరలిన మధ్యాహ్న భోజన కార్మికులు

కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా, కలెక్టర్‌కు వినతి

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల బిల్లులు వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని సోమవారం ప్రభుత్వ పాఠశాలల్లో వంట చేయడం బంద్ చేసి చలో కలెక్టరేట్‌కు తరలి వచ్చారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న, జిల్లా అధ్యక్షురాలు ఎస్.అలివేలు మాట్లాడుతూ.. పెరిగిన ధరలకనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు, జీతాలు చెల్లించాలని, కోడిగుడ్లు ప్రభుత్వమే పాఠశాలలకు సరఫరా చేయాలన్నారు. ఉచితంగా గ్యాస్ సిలిండర్లను ప్రతీ స్కూలుకు సరఫరా చేయాలని, కాటన్ దుస్తులు యూనిఫామ్‌గా ఇవ్వాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కనీస వేతనం రూ26వేలు ఇవ్వాలని ప్రమాద బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో మా గ్రామలను కలపొద్దు

చేవెళ్ల మున్సిపాలిటీలో పల్గుట్ట, కందాడ గ్రామాలను కలపొద్దని చేవెళ్ల మండలం కందాడ, పల్గుట్ట గ్రామస్తులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రెండు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

రైతుభరోసా రాలేదు..

రైతు భరోసా డబ్బు తమ ఖాతాల్లో జమ కాలేదని మంచాల మండల బండలేమూరు గ్రామ రైతులు కలెక్టరేట్ ఎదుట పాసు పుస్తకాలు చేత పట్టుకుని నిరసన తెలిపారు. వెంటనే తమకు రైతుభరోసా వేయాలని డిమాండ్ చేశారు. కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.

ఇంటి స్థలం ఇవ్వాలని ధర్నా..

ఇబ్రహీంపట్నం, ఎల్బీనగర్, హయత్‌నగర్ మండలాల్లో 770 మంది గంగిరెద్దుల సామాజిక వర్గానికి చెందిన వారు ఇబ్రహీంపట్నం మండల మంగల్‌పల్లిలోని సర్వే నెంబర్ 162లోని ప్రభుత్వ భూమిలో ఇంటి స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.

ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖలో సిబ్బంది కొరత వేధిస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సలహాలు సూచనలు ఇచ్చే అధికారులు లేకపోవడంతో వారు వ్యవసాయాన్ని వదిలేసే పరిస్థితి నెలకొంది. ఈ శాఖలో మొత్తం 38 పోస్టులు ఉండగా ఎనిమిది మంది అధికారులే పనిచేస్తున్నారు. మిగతావి ఏళ్ల తరబడి ఖాళీగానే ఉన్నాయి. ఉన్న ఒక్కో అధికారికి ఎక్కువ మండలాల బాధ్యతలు ఉండటంతో పనిభారం పెరిగి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచాల్సిన అవసరం ఉంది.



ఉద్యాన శాఖలో ఉద్యోగులేరి?

వేధిస్తున్న సిబ్బంది కొరత.. ఇబ్బందుల్లో రైతులు


38 పోస్టులకు ఉన్నది 8 మంది అధికారులే..

క్షేత్రస్థాయిలో పర్యటించేది కేవలం నలుగురే..

ఒక్కో అధికారికి తొమ్మిదికి పైగా మండలాల బాధ్యతలు

పనిభారంతో సతమతమవుతున్న హార్టికల్చర్ అధికారులు

జిల్లాలో ఏళ్ల తరబడి భర్తీకాని పోస్టులు



రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖలో ఉద్యోగ, సిబ్బంది కొరత వేధిస్తోంది. ఏళ్లతరబడి ఈ సమస్య తీరడం లేదు. ఈ రెండు శాఖల్లో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. దీంతో జిల్లాలో ఉద్యానవన, పట్టు పరిశ్రమ సాగు విస్తీర్ణం ఏటేటా తగ్గుతూ వస్తుంది. పెరుగుతున్న జనాభాకు సరిపడా కూరగాయల ఉత్పత్తి జరగడం లేదు. శివారు ప్రాంతంలో వ్యవసాయం చాలా వరకు తగ్గిపోయింది. వ్యవసాయ భూములు వెంచర్లుగా మారిపోయాయి. ఎక్కడ చూసినా లేఅవుట్లు, వెంచర్లే దర్శనమిస్తున్నాయి. ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులకు ప్రోత్సాహం లేకపోవడంతో చాలా వరకు భూములు అమ్ముకుని వ్యవసాయం చేయడమే మానేశారు. సాగు విస్తీర్ణం పెంచేందుకు అవసరమైన చర్యలు ఉద్యానశాఖ తీసుకోవడం లేదు. ఉద్యాన రైతులకు సబ్సిడీపై విత్తనాలు, యంత్రాలు అందటం లేదు. పాలీహౌజ్ రైతులకు పట్టించుకోవడం లేదు. డ్రిప్ కోసం దరఖాస్తు

మిగతా 8వ పేజీలో...

ప్రజావాణికి 70 ఫిర్యాదులు

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 70 ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టర్ సి. నారాయణరెడ్డి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. రెవెన్యూ శాఖకు 36, ఇతర శాఖలకు 34 ఫిర్యాదుల వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. స్వీకరించిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రానున్న ఇంటర్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని తెలిపారు. పదో తరగతి పరీక్షల్లోనూ మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని తెలిపారు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కుంగ్‌ఫూలో విద్యార్థుల ప్రతిభ



చౌదరిగూడ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి):కుంగ్‌ఫూ కరాటే పోటీలో విద్యార్థులు ప్రతిభ చూపారని మాస్టర్ రమేష్ తెలిపారు. కొందుర్గులో ఆదివారం నిర్వహించిన మూడో జిల్లాస్థాయి కరాటే పోటీలో ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల 40స్కూళ్ల 350 మంది విద్యార్థులు కుంగ్‌ఫూ పోటీలో పాల్గొన్నట్లు రమేష్ తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కొందుర్గు మాజీ వైస్ఎంపీపీ రాజేష్ పటేల్, బీఆర్ఎస్ యువ నాయకుడు రవీందర్‌రెడ్డి మెమొంటోలు అందజేశారు. షాద్‌నగర్ గ్రంథాలయ వైస్‌చైర్మన్ బాల్‌రాజ్, మాజీ సర్పంచ్ రామకృష్ణ, మాస్టర్లు నరేష్, నందు, రాజు, కార్తీక్, రాము, సత్యం తదితరులు పాల్గొన్నారు.

అనంతపద్మనాభ స్వామి ఆశీస్సులు రేవంత్‌రెడ్డికి ఉండాలి

- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్
- పూజల్లో పాల్గొన్న ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, ప్రకాశ్‌గౌడ్
- పెంజర్లలో ఆధ్యాత్మిక శోభ



అనంతపద్మనాభస్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్, ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్, ఫిబ్రవరి 24:(ఆంధ్రజ్యోతి) రాష్ట్రాభివృద్ధితో పాటు, నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అనంతపద్మనాభ స్వామి మరింత శక్తిని ప్రసాదించాలని వేడుకున్నట్లు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ పేర్కొన్నారు. మండల పరిధిలోని పెంజర్ల గ్రామ శివారులోని 500ఏళ్ల నాటి స్వయంభు శ్రీఅనంతపద్మనాభస్వామి దేవాలయ పునర్నిర్మాణ పూజలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా చివరి రోజు సోమవారం ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, ప్రకాష్‌గౌడ్‌లతో కలిసి స్పీకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి అర్చకులు, మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, దేవాలయం పాలక మండలి చైర్మన్ బెజవాడ అనితారెడ్డిలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అత్యాధునిక హంగులతో నిర్మించిన పాత గుడిలో స్పీకర్, ఎమ్మెల్యేలు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్పీకర్ మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురం, వికారాబాద్ అనంతపద్మనాభ స్వామి దేవాలయాల తర్వాత పెంజర్ల అనంత పద్మనాభస్వామి ఆలయం అంతటి ప్రాముఖ్యతను సంతరించుకుందన్నారు. ఈ ప్రాంతం ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చెందేలా మంచి వాతావరణం నెలకొని ఉందన్నారు. ఈ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు నిధుల కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి ద్వారా ప్రభుత్వానికి సిఫారసు చేయిస్తానని తెలిపారు. భగవత్‌నామస్మరణతో ముక్తి మార్గం లభిస్తుందని, ప్రతీఒక్కరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకొని ప్రశాంత జీవనం గడపాలని స్పీకర్ అన్నారు. దేవాలయ పునర్నిర్మాణ కార్యక్రమానికి వేలాది మంది భక్తులు హాజరై పూజలుచేశారు. అంతకుముందు స్థానిక బైపాస్ వద్ద స్పీకర్‌కు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పి. శివశంకర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల, మున్సిపాలిటీ శాఖ అధ్యక్షులు హరినాథ్‌రెడ్డి, జె. సుదర్శన్‌గౌడ్, నాయకులు మామిడి జనార్ధన్‌రెడ్డి, జె. గోవర్ధన్‌గౌడ్, వీరమోని దేవేందర్‌ముదిరాజ్, అంబటి ప్రభాకర్, మామిడి సిద్దార్థరెడ్డి, జెనిగె జగన్, కమ్మరి జనార్ధన్‌చారి, ఇందూరి శ్రీను, చిల్కమర్రి నర్సింహ్మ, మహేష్‌గౌడ్, పల్గుట్ల శంకర్, ఎర్రొళ్ల జగన్, కాట్న రాజు, రమేష్, సుధాకర్, శ్రీనివాస్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, నవీన్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్, భార్గవ్‌గౌడ్, గోవింద్ నాయక్ పాల్గొన్నారు.

రేపు ఆమనగల్లుకు స్పీకర్ రాక

ఆమనగల్లు : స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం తలకొండపల్లి మండలం చెన్నారం మల్లప్పగుట్ట మల్లికార్జున స్వామి దేవాలయాన్ని సందర్శిస్తారని ఆలయ గౌరవాధ్యక్షుడు ఏమిరెడ్డి పాండురెడ్డి, ఆలయ నిర్వాహకుడు కల్లు పెంటారెడ్డి, ఆలయ అధ్యక్షుడు మాకం పాండయ్య తెలిపారు. ఆలయంలో నిర్వహించే శివరాత్రి బ్రహ్మోత్సవాలు, శివపార్వతుల కల్యాణంలో ఆయన పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తదితరులు హాజరవుతారన్నారు.



బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆలయ చైర్మన్ తటాకం నారాయణ శర్మ

కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

అట్టహాసంగా ప్రారంభమైన మహాశివరాత్రి జాతర

ఆరు రోజుల పాటు స్వామివారికి ప్రత్యేక పూజలు.. వైదిక కార్యక్రమాలు

జాతరలో క్రీడా పోటీలను ప్రారంభించిన స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి

నేడు స్వామివారి కల్యాణమహోత్సవం.. పెద్ద సంఖ్యలో హాజరుకానున్న భక్తులు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న శివసేన రెడ్డి

కీసర, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కీసరగుట్ట శ్రీభవానీ శివదుర్గ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సోమవారం అంకురార్పణ జరిగింది. మొదటి రోజు విఘ్నేశ్వరుని పూజతో ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ చైర్మన్ తటాకం నారాయణశర్మ ఆధ్వర్యంలో, వేద పండితులు గణపతి శర్మ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అర్చకులు ఆయనకు స్వామివారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం ఇచ్చారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారన్నారు. ఉత్సవాల సందర్భంగా పలు కుల సంఘాల ఆధ్వర్యంలో అన్నదానాలను ప్రారంభించారు. మొదటి రోజు ఆర్యవైశ్య, రెడ్డి అన్నదానం సత్రాలలో అన్నదానాలు ప్రారంభమయ్యాయి. ఆరు రోజుల పాటు క్షేత్రంపై అన్నదానాలు నిర్వహించనున్నారు. అలాగే ఆలయ చైర్మన్ తటాకం నారాయణ శర్మ, ఈవో సుధాకర్‌రెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ గౌతమ్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. అదే విధంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు ఆహ్వానం అందజేశారు.

నేడు స్వామి వారి కల్యాణం

రెండో రోజు మంగళవారం రుద్రస్వాహాకార హోమం, జ్వాలార్చన, రుద్రస్వాహాకార హోమం, హారతి, మంత్రపుష్పం, పరాకస్తం, తీర్థ ప్రసాద వినియోగం, శ్రీ స్వామివారి

మిగతా 7వ పేజీలో...

కేంద్ర పథకాల అమలు భేష్

- కేంద్ర 7వ కామన్ రివ్యూ మిషన్ బృందం



సమీక్షలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, కేంద్ర బృంద సభ్యులు

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరు బాగుందని కేంద్ర ఏడొవ కామన్ రివ్యూ మిషన్ బృంద సభ్యులు కితాబిచ్చారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారుల బృందం ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు జిల్లాలో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించారు. ఉపాధిహామీ పథకం, ఎన్ఆర్ఎల్ఎం, పీఎంజీఎస్‌వై, ఎస్ఏపీ, పీఎంఏవై, జీపీడీపీ, డీడీయు జీకేవై, ఆర్ఎస్ఈటీఐ, మిషన్ అంత్యోదయ, 14, 15 ఆర్థిక సంఘం ద్వారా చేపట్టిన పనులను జిల్లాలోని కందుకూరు మండలం రాచులూరు, తిమ్మాపూర్, ఆమనగల్లు, కడ్తాల్ గ్రామాల్లో పరిశీలించారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుతీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం మహిళాసంఘాల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు ఆదర్శవంతంగా ఉన్నాయని పేర్కొన్నారు. ముచ్చింతల ఆర్ఎస్ఈటీఐ శిక్షణ కార్యక్రమాలను పరిశీలించి మహిళా సంఘాల వారిగా ఉత్పత్తులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర అధికారుల బృందం ప్రతినిధులు డాక్టర్ ఎంసీ పాల్, డాక్టర్ జావేద్, ఎక్బాల్, డాక్టర్ వికాస్ కుమార్, డాక్టర్ అభిజిత్ దాస్, ఆర్డీవో, జడ్పీ సీఈవో, డీపీవో, హౌజింగ్ పీడీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

- కడీలు పాతి ఎస్కవేటర్‌తో రాళ్ల తొలగింపు
- అడ్డుకున్న గ్రామస్తులు
- రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు
- ఘటనా స్థలానికి పోలీసులు
- పనులు నిలిపివేయాలని ఆదేశం

7



సర్వర్ డౌన్..ఆగిన రిజిస్ట్రేషన్లు

● ఇబ్బందులుపడిన భూ క్రయ, విక్రయదారులు

పరిగి/ఇబ్రహీంపట్నం/చేవెళ్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్‌లో సర్వర్ సమస్య కారణంగా ఉమ్మడి జిల్లాలో జిల్లాలో పలు చోట్ల సోమవారం రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. వికారాబాద్ జిల్లాలోని 20 మండలాల్లో ఎక్కడ కూడా రిజిస్ట్రేషన్‌లు జరగలేదు. భూముల రిజిస్ట్రేషన్‌ల కోసం స్లాట్లు బుక్ చేసుకున్న వారంతా రోజంతా తహసీల్దార్ కార్యాలయాల వద్ద పడిగాపులు కాశారు. జిల్లాలో సోమవారం ఒక్కరోజే 120కిపైగా రిజిస్ట్రేషన్‌ల కోసం స్లాట్స్ బుక్ చేసుకున్నారు. సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తిన కారణంగా రిజిస్ట్రేషన్‌లు జరగలేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఒక్క పరిగిలోనే 16స్లాట్స్ బుక్ చేసుకున్నా రిజిస్ట్రేషన్‌లు మాత్రం కాలేవు. పోర్టల్‌లో సర్వర్ ప్రాబ్లమ్ సమస్య అంతటా ఉందని ధరణి జిల్లా కో-ఆర్డినేటర్ వెంకటేశ్ తెలిపారు. అలాగే రంగారెడ్డి జిల్లా మంచాలలో భూముల రిజిస్ట్రేషన్లు నిలిపోయాయి. యాచారంలో కేవలం రెండు రిజిస్ట్రేషన్‌లు మాత్రమే జరిగాయి. ఇబ్రహీంపట్నంలో ఆలస్యమైనప్పటికి స్లాట్ బుకింగ్ ప్రకారం కావాల్సిన రిజిస్ట్రేషన్‌లు పూర్తి చేశారు. వచ్చే నెలలో భూభారతి సాఫ్ట్‌వేర్‌ను ప్రభుత్వం ప్రారంభం చేయనున్నట్లు తెలుస్తుంది. అందుకే అప్పుడప్పుడు సాఫ్ట్‌వేర్ సమస్యలు తలెత్తాయి. చేవెళ్ల డివిజన్ పరిధి చేవెళ్ల మండలంలో 28 డాక్యూమెంట్లు, షాబాద్ మండలంలో 20 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు కాకుండా నిల్చిపోయాయి, శంకర్‌పల్లి మండలంలో 19 డాక్యుమెంట్లకుగాను 8 రిజిస్ట్రేషన్లు చేయగా మిగతా 11డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కావాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు. అయితే మొయినాబాద్ మండలంలో మాత్రం 20 డాక్యుమెంట్లు రాత్రి వరకు అధికారులు ఉండి రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. అయితే మిగిలిన మూడు మండలాల్లో మాత్రం ఉదయం నుంచి సాయంత్రం వరకు ధరణిపోర్టల్ సర్వర్ సమస్య వలన రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ల ఎదుట నిరసన


రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రమిస్తున్న జర్నలిస్టులు

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని, ఇళ్ల స్థలాలు కేటాయించాలని, కొత్తగా ఆరోగ్య బీమా పథకాన్ని తీసుకురావాలని టీడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సత్యనారాయణ, మైల సైదులు డిమాండ్ చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లతో కూడిన ఫ్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో సర్కారు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కొత్త ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని, తదితర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరంకలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ జర్నలిస్టుల పిల్లలకు ప్రభుత్వం నిబంధనలు ప్రకారం అన్నీ ప్రైవేట్ విద్యాసంస్థల్లో 50 శాతం రాయితీ ఇచ్చేలా చూడాలని డీఈవో ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు నర్సింహారెడ్డి, అంజనేయులు, నరేష్, మల్లేష్, శేఖర్, సురేష్ పాల్గొన్నారు

మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట..


మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టుల నిరసన

మేడ్చల్ ప్రతినిధి (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని, సమస్యలు పరిష్కరించాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టరేట్ ఎదుట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జర్నలిస్టులు హాజరై నిరసన తెలిపారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. హరిప్రసాద్, బెలిదే అశోక్, రోజా రాణి, నర్సింహులుయాదవ్, అశోక్, మల్లేష్‌గౌడ్, గంజికృష్ణ, రామచంద్ర మూర్తి, పాల్గొన్నారు.

ఫార్మాసిటీ రద్దుకోసం కృషి చేస్తాం

యాచారం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): యాచారం మండలంలో ఫార్మాసిటీ రద్దు కోసం కృషిచేస్తామని, భూసేకరణ జరగకుండా చూస్తామని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. సోమవారం మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల రైతులు తీన్మార్ మల్లన్నను నగరంలోని ఆయనను కలిసి తమను ఆదుకోవాలని కోరారు. భూముల వివరాలను నిషేధిత జాబితాలోంచి తీసేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి ఫోన్ చేసి కోరారు. తాను రైతుల పక్షాన పోరాడుతానని హామీ ఇచ్చారు. అనంతరం రైతులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. రైతులకు అన్యాయం జరగకుండా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ కవుల సరస్వతి, రైతులు ఉన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

కేశంపేట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమి పక్కన కొంత భూమి కొన్న వ్యక్తి ప్రభుత్వ భూమి కబ్జాకు పూనుకున్నాడు. కడీలు పాతి ఎస్కవేటర్‌తో రాళ్లకు తొలిగిస్తుండగా గ్రామస్తులు అడ్డుకొని రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసిన ఘటన బైర్కాన్‌పల్లిలో సోమవారం చోటుచేసుకుంది. బైర్కాన్‌పల్లిలో సర్వే నంబర్ 53లో డంపింగ్ యార్డు పక్కన 4ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇక్కడ సోలార్ పవర్ ప్లాంట్‌ను వేసేందుకు గతంలోనే గుర్తించారు. గత నెల 21న అధికారులు డంపింగ్ ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ భూమి పక్కనే హైదరాబాద్‌కు చెందిన డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఓ బడా ఉద్యోగికి 10ఎకరాలు ఉంది. దానికి అనుకొనే సర్వే నంబర్ 53/37లో 5భూమి కొన్నాడు. అయితే అతడు ప్రభుత్వ భూమి చదునుకు పూనుకోగా గ్రామస్తులు అడ్డుకున్నారు. రెవెన్యూ, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పెట్రోలింగ్ పోలీసులు చేరుకుని పనులు ఆపాలని సూచించారు. బైర్కాన్‌పల్లి మాజీ సర్పంచ్ రూప్లానాయక్ మాట్లాడుతూ.. సర్వే నంబర్ 53లో ప్రభుత్వ స్థలంలో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు అధికారులు స్థల పరిశీలన చేశారన్నారు. హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి దాన్ని కడీలు పాతి కబ్జా చేస్తున్నాడని తెలిపారు. మరో రైతు అంజయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిని కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. డబ్బు, అధికార బలంతో ఓ వ్యక్తి స్థలాన్ని ఆక్రమించేందుకు చూస్తున్నాడని తెలిపాడు. ఈ విషయమై కేశంపేట తహసీల్దార్ మీర్ ఆజం అలీ మాట్లాడుతూ.. సర్వే నంబరులో 53లో ప్రభుత్వ స్థలంలో పనులు చేస్తున్నారని ఫిర్యాదు రావడంతో వీఆర్‌ఏ పంపామన్నారు. ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పదవుల్లో యువజన కాంగ్రెస్‌కు పెద్దపీట


కేఎల్లార్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నేతలు

మహేశ్వరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు, నామినేటెడ్ పదవుల్లో యువజన కాంగ్రెస్ నాయకులకు పెద్దపీట వేస్తామని మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలదీ ఇదే ఆలోచనని తెలిపారు. సోమవారం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్‌యాదవ్ కేఎల్లార్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఒక్క మన రాష్ట్రంలోనే కాకుండా దేశం మొత్తం యువజన కాంగ్రెస్ నాయకులు కీల భాధ్యతలు అప్పగించాలని రాహుల్‌గాంధీ సీఎంలు, పీసీసీలకు ఆదేశాలు ఇచ్చారన్నారు. కష్టపడ్డ ప్రతీ కార్యకర్తను కాంగ్రెస్ మరిచిపోదన్నారు. కార్యక్రమంలో యువ నాయకులు వెంకటేష్ గౌడ్, రాజు, రవికాంత్‌రెడ్డి, యూనస్ పాల్గొన్నారు.

వేడుకలకు 'వెండికొండ' సిద్ధం



వెండికొండ సిద్దేశ్వరాలయం

శంషాబాద్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి వేడుకలకు శంషాబాద్‌లోని చారిత్రక వెండికొండ సిద్ధేశ్వరస్వామి(సిద్దులగుట్ట) ఆలయం ముస్తాబైంది. స్థానికులు, జంటనగరాల భక్తులు నిత్యం ఈ ఆలయానికి వస్తుంటారు. శంషాబాద్‌కు రెండు కిలోమీటర్ల దూరంలోని పాలరాతి కొండ మధ్య ఈ ఆలయం ఉంది. శివలింగానికి అభిషేకంతో ఉత్సవాలు మొదలై ఉపవాసదీక్షతో ముగుస్తాయి. రాత్రి శివపార్వతుల కల్యాణం, భజన మండలి భక్తులతో భజన, జాగరణ కార్యక్రమాలు ఉంటాయి.

కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో శివరాత్రి పూజలు

కొత్తూర్, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని శివనగర్‌లో వెలసిన శ్రీ కాశీవిశ్వనాథస్వామి ఆలయం ముస్తాబైంది. ఈ నెల 26 నుంచి 27వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు. వ్యాపారవేత్త దివంగత జాండగూడెం గణపతిగౌడ్ 25ఏళ్ల క్రితం కాశీ నుంచి శివలింగం తెచ్చి సొంత భూమిలో ప్రతిష్ఠించి, ఆలయాన్ని నిర్మించారు. నాటి నుంచి ఈ ప్రాంతాన్ని శివనగర్‌గా పిలుస్తారు. 26న సుప్రభాతసేవ, గణపతిపూజ, దేవతస్థాపన, శరుద్రాభిషేకం, సహస్రబిల్వార్చన, పల్లకిసేవ, అఖండభజన, మహాలింగోద్భవ పూజలు ఉంటాయి. 27న సుప్రభాతసేవ, మంత్రపుష్పము, మహానైవేద్యం, తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌తో మేథాశక్తి పెంపు


ఎగ్జిబిట్ల గురించి వివరిస్తున్న విద్యార్థులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులోని లిటిల్ స్కాలర్స్ హైస్కూల్‌లో సోమవారం వైజ్ఞానిక వస్తు ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఎంఈవో పాండు, కరస్పాండెంట్ సుజాతసుదర్శన్‌రెడ్డి, చైర్మన్ అల్లాజీగౌడ్‌లతో కలిసి మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ మేళాను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ శ్రీశైలం, టీచర్ల పర్యవేక్షణలో విద్యార్థులు 100అంశాలపై సైన్స్ ప్రదర్శనలు ఇచ్చారు. 250మంది విద్యార్థులు రూపొందించిన వస్తుసామాగ్రి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు మేథాశక్తి, నైపుణ్యాన్ని చాటాయి. సోలార్‌ఎనర్జి, ఫిజిక్స్, సహజ విద్యుత్ తయారీ, నీటి పునరుద్ధరణ, 2డీ, 3డీ, నాడీ వ్యవస్థ, రక్తప్రసరణ, జీర్ణ వ్యవస్థ, రక్తపరీక్షల ప్రయోగాలు తదితర ప్రదర్శనలపై విద్యార్థులు సందర్శకులకు వివరించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను, మేథాశక్తిని వెలికి తీసేందుకు ఇలాంటి మేళాలు దోహదంచేస్తాయని ముఖ్య అతిథులు అన్నారు. కార్యక్రమంలో అకడమిక్ అడ్వైజర్ సుదర్శన్‌రెడ్డి, డైరెక్టర్ సావిత్రి, టీచర్లు రేవతి, రమాదేవి, అతస్మర్, మాధురి, అయ్యూబ్, కృష్ణ పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఆమనగల్లు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకుపోవాలని ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు తప్పక ఉంటుందని పేర్కొన్నారు. మండలంలో సోమవారం వంశీచంద్‌రెడ్డి పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈగల్ కమిటీ సభ్యుడిగా నియమితులైన వంశీచంద్‌ను పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ సత్కరించారు. వంశీచంద్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సంసిద్ధం కావాలన్నారు. రాష్ట్రంలో ఎన్నిక ఏదైనా కాంగ్రెస్‌దే విజయమన్నారు. కల్వకుర్తి ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో బిచ్యానాయక్, జగన్, ప్రభాకర్‌రెడ్డి, మానయ్య, రవీందర్‌యాదవ్, ఎం.అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పథకాల పూర్తికి చర్యలు తీసుకోవాలి

ఆమనగల్లు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల పూర్తికి అధికారులు చొరవ తీసుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాల వ్యవసాయ శాఖ అధికారులతో సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. ఏడీఏగా బాధ్యతలు చేపట్టిన శోభారాణి ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇచ్చారు. సబ్‌డివిజన్ పరిధిలో వ్యవసాయ శాఖ చేపడుతున్న కార్యక్రమాలను ఏవోలు ఎమ్మెల్యేకు వివరించారు. ఆరు తడి పంటల సాగు, పామాయిల్‌తో లాభాల గూర్చిరైతులకు వివరించాలని ఆయన ఆదేశించారు. సబ్సిడీ స్ప్రింక్లర్లను రైతులు వినియోగించుకునేలా చూడాలన్నారు. పంటలకు మద్దతు ధర, సబ్సిడీలు, బోనస్‌పై వివరించాలన్నారు. వేసవిలో ఆరుతడి పంటలే వేసుకునేలా చూడాలన్నారు. ఏడీఏ కార్యాలయానికి నూతన భవనం నిర్మించాలని అధికారులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఏవోలు శ్రీనివాస్‌గౌడ్, శ్రీలత, అరుణకుమారి, రేణుక పాల్గొన్నారు.

భూకైలాస్‌లో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రేపు శివుడిని దర్శించుకోనున్న మహారాష్ట్ర మంత్రి సంజయ్ రాథోడ్


ఆలయంలోని శివలింగం

తాండూరు రూరల్, ఫిబ్రవరి 24, (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లాలోని తాండూరు మండలం అంతారం తండాలోని భూకైలాస్ ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని సోమవారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. గణపతిపూజ, సర్వదేవతలకు అభిషేకాలు నిర్వహించారు. నేడు(మంగళవారం) గౌరిపూజ, గంగపూజ, యాగశాల ప్రవేశం, మంటపారాధన, ధ్వజారోహణం, అగ్నిప్రజ్వలన, గణపతిహోమం నిర్వహిస్తారు. 26న మహాశివరాత్రిని పురస్కరించుకొని మహారాష్ట్ర భూగర్భ, జలవనరుల శాఖ మంత్రి సంజయ్ రాథోడ్ హెలీకాప్టర్ ద్వారా భారీ శివుడిపై పూలవర్షం కురిపించేందుకు ఏర్పాట్లు చేశారు. మంత్రి భూకైలాస్ ఆలయంలో రెండు గంటలపాటు ప్రత్యేక పూజల్లో పాల్గొననున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి ఆలయ వ్యవస్థాపకులు వాసుపవార్ నాయక్, ఆయన సోదరుడు ఆల్ ఇండియా బంజారా సంఘం అధ్యక్షుడు శంకర్‌నాయక్‌లు అనుమతి పత్రాన్ని తాండూరు డీఎస్పీ, టౌన్ సీఐ కి అందజేశారు.

కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

(ఐదో పేజీ తరువాయి)

ఉత్సవమూర్తులు పల్లకీ సేవలో నడకదారిన కీసరగుట్ట చేరుకున్న అనంతరం శ్రావణ నక్షత్రయుక్త తుల లగ్నమందు స్వామి కల్యాణం నిర్వహించనున్నారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించే క్రీడా పోటీలను స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడలకు ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. ప్రతిభావంతులను వెలికితీసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు.

మండుటెండల్లో విద్యార్థుల పడిగాపులు

ప్రతీ సంవత్సరం నిర్వహించే పోటీల ప్రారంభోత్సవంలో విద్యార్థులకు మాత్రం ఇక్కట్లు తప్పడం లేదు. ఈ సందర్భంగా నిర్వహించే


కలెక్టర్ గౌతమ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

మార్చ్‌ఫాస్ట్‌కు జిల్లాలోని వివిధ పాఠశాల నుంచి విద్యార్థులు మైదానానికి తీసుకొస్తారు. ఈ క్రమంలో క్రీడా పోటీలను ప్రారంభించే ముఖ్య అతిథి కోసం విద్యార్థులకు గంటల తరబడి ఎదురుచూపులు తప్పడం లేదు. సోమవారం ప్రారంభోత్సవానికి శివసేన రెడ్డి ఆలస్యంగా రావడంతో పోటీలు మధ్యాహ్నం ప్రారంభించారు. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మండుటెండలో విద్యార్థులు పడిగాపులు కాయాల్సిన దుస్థితి.

బస్సు ప్రాంగణం ప్రారంభం

కీసరగుట్టలో గ్రేటర్ హైదరాబాద్ ఆర్టీసీ ఈడీ రాజశేఖర్ సోమవారం బస్సు ప్రాంగణాన్ని ప్రారంభించారు. కుషాయిగూడ, చెంగిచెర్ల, కంటోన్మెంట్ ఉప్పల్, హకీంపేట, రాణిగంజ్ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆయన తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి: సీపీ సుధీర్‌బాబు

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు. ఈ మేరకు సోమవారం కీసరగుట్టలో ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దన్నారు. మహిళల పట్ల ఆకతాయిలు చేసే అల్లరి పనులను, దొంగతనాలు, నివారించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలను అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించి జాతరను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి డీసీపీ పద్మజా, ఐపీఎస్ డీసీపీ క్రైమ్ అరవింద్ బాబు, ఐటీ సెల్ ఏసీపీ నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు

తహసీల్దార్ కార్యాలయంలో కుర్చీలన్నీ ఖాళీ

కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య

యాలాల, ఫిబ్రవరి 24, (ఆంధ్రజ్యోతి) : యాలాల తహసీల్దార్ కార్యాలయంలో కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య ఆరోపించారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సిబ్బంది కొరత కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రోజుల తరబడి ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా రైతుల విరసత్, పట్టా మార్పులు కోసం వచ్చేవారు అధికారులు లేక ఉసూరుమంటూ తిరిగి వెళ్లిపోతున్నారని వాపోయారు. కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, గిర్దావర్, మండల సర్వేయర్, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం తహసీల్దార్, గిర్దావర్, కొంతమంది సిబ్బంది మాత్రమే ఉన్నారన్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో కూడా పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయని చెప్పారు. వీటిని వెంటనే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే కేవీపీఎస్ ఆధ్వర్యంలో కలెక్టర్ ఎదుట పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో కేవీపీఎస్ నాయకులు నర్సింహులు, శివప్ప, రవి పాల్గొన్నారు.

కల్తీ పదార్థాలపై అవగాహన ఉండాలి

మహేశ్వరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కల్తీ ఆహార పదార్థాలను గుర్తించేలా ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని రసాయణ శాస్త్ర విభాగాధిపతి దయానంద్, ఆహార కల్తీనిర్ధారణ రిటైర్డ్ అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామం, పట్టణం, నగరం ఇలా ఎక్కడ చూసినా ఆహార పదార్థాల కల్తీ ఎక్కువైందన్నారు. ప్రతీ విద్యార్థి కల్తీ ఆహార పదార్థాలను గుర్తించేలా అవగాహన ఉండాలన్నారు. వ్యాధులకు మూలం కల్తీ ఆహారమే అన్నారు. విద్యార్థి దశ నుంచే కల్తీ ఆహార పదార్థాలను గుర్తించేలా అవగానను పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్, ఇంతియాజుద్దీన్, శ్రీదేవి, నరేందర్‌రెడ్డి, శ్రీహరి, జహీదాబేగం, ఫర్నాజ్, సునీత, సుమతి, రమేష్ పాల్గొన్నారు.

రాజరాజేశ్వరాలయం ముస్తాబు

- మహాశివరాత్రికి ఏర్పాట్లు
- పూర్తి చేసిన ఆలయ కమిటీ



మహేశ్వరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహేశ్వరంలోని శ్రీ శివగంగా రాజరాజేశ్వరాలయం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. నేటి నుంచి మార్చి 1వ తేదీ వరకు కొనసాగే బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని అలంకరించారు. ఆలయం మధ్యలో ఉన్న కోనేటిలో భక్తులు స్నానమాచరిస్తారు. ఐదు రోజులు నిర్వహించే జాతరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. మహేశ్వరం, మిధాని, షాద్‌నగర్, ఫలక్‌నుమా డిపోల నుంచి ఆర్టీసీ బస్సులు నడుపుతారు. బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ ఈవో మురళీకృష్ణ, కమిటీ చైర్మన్ అల్లెకుమార్ వివరించారు. 25 గణపతిపూజ, పుణ్యాహవచనం, ధ్వజారోహణం, 2న మహాశివరాత్రి రుద్రాభిషేకం, కుంకుమార్చన, బిల్వార్చన, మహా మంగళహారతి, సాంస్కృతిక కార్యక్రమాలుంటాయి. 27న రాజరాశ్వరస్వామి రుద్రాభిషేకాలు, శివపార్వతుల కల్యాణం, 28న స్వామివారి రుద్రహోమం, రథోత్సవం, మార్చి 1న లలితాసహస్రపారాయణం, దోపోత్సవం ఉంటాయని తెలిపారు.

250 మంది పోలీసులతో బందోబస్తు

బ్రహ్మోత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశామని మహేశ్వరం సీఐ హెచ్. వెంకటేశ్వర్లు తెలిపారు. ఏడుగురు సీఐలు, 32మంది ఎస్సైలు, ఒక ఏడీసీపీ, ఒక డీసీపీ మొత్తం 250మంది సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. విధుల్లో ఉండే పోలీసు సిబ్బందికి భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు సహకరించాలన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

వికారాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి సందర్భంగా జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 109 ఫిర్యాదులను సమర్పించాలని, వాటిలో ధరణికి సంబంధించి భూ సమస్యలు, ఆసరా పింఛన్లు, ఇరిగేషన్, భూ సర్వే ఇతర సమస్యలకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. భూ సమస్యలకు సంబంధించి ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేసి రిపోర్ట్ పంపించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్‌డీవో వాసుచంద్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మేడ్చల్ ప్రతినిధి: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.ఫిర్యాదులపై చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలన్నారు. 64 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, డీఆర్‌ఓ హరిప్రియ పాల్గొన్నారు.

కాగా ప్రజావాణికి జిల్లా అధికారులు హాజరుకాకపోవడంపై అదనపు కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అసిస్టెంట్‌లను పంపడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ప్రజావాణికి జిల్లా అధికారులు తప్పకుండా హాజరుకావాలని ఆదేశించారు.

ప్రభుత్వ నిబంధనల మేరకు ఇంటి నిర్మాణం చేపట్టాలి

కులకచర్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టాలని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన మండలంలోని అనంతసాగర్ గ్రామంలో సోమవారం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామానికి 163 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. మొదటగా స్థలం ఉన్న వారు నిర్మించుకోవాలన్నారు. మూడు విడతలుగా బిల్లు మంజూరవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈఈ సయ్యద్ మక్రంబాబా, ఏఈ సందాని, కార్యదర్శి శ్రీనివాస్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కులకచర్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మన ఊరు, మన బడి కార్యక్రమంలో చేపట్టిన పనులకు బిల్లులు అందించాలని మండలంలోని వివిధ గ్రామాల మాజీ విద్యా కమిటీ చైర్మన్లు కోరారు. వికారాబాద్‌లో ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అప్పులు చేసి లక్షల్లో పనులు చేపట్టామని, చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బిల్లులు మంజూరు చేయాలని కోరారు.

విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి

కులకచర్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని స్థానిక బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జైపాల్‌రెడ్డి అన్నారు. కులకచర్లలో సోమవారం మ్యాజిక్ బస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మహిళలకు పలు కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఎంపీవో భాస్కర్‌గౌడ్, హెల్త్ అసిస్టెంట్ వెంకట్, చాకలి వెంకటేశ్, నర్సిములుగౌడ్ పాల్గొన్నారు.

దళితులపై వివక్ష చూపేవారిపై చర్యలు తీసుకోవాలి



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న దళిత సంఘాల సభ్యులు

శామీర్‌పేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : దళితులపై వివక్ష చూపుతూ రోడ్లకు అడ్డుగా నిర్మాణాలు చేసిన తిరుమల కాలనీ వాసులపై కఠిన చర్యలను తీసుకోవాలని తెలంగాణ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాంమోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్‌లో తిరుమల కాలనీ వాసులు దళితులు నివాసముంటున్న కాలనీలో రాకపోకలు సాగించే రోడ్లకు అడ్డుగా నిర్మాణాలు చేసి రాకపోకలను బంద్ చేశారు. ఈ నిర్మాణాలను తొలగించి దళితులు రాకపోకలు సాగించేలా చూడాలని సోమవారం దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాంమోహన్ ఆధ్వర్యంలో దేవరయాంజాల్ నుంచి తూంకుంటలోని మున్సిపల్ కార్యాలయం వరకు దళిత సంఘాల సభ్యులు, దళిత కాలనీ వాసులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ శ్రావణ్‌కుమార్‌ను కలసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు.

గురుకుల విద్యాలయ ఆస్తులను పరిరక్షించాలి


ఉత్తరాన్ని పోస్టు చేస్తున్న టీడీపీ నాయకులు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లోని గురుకుల్ విద్యాలయ ఆస్తులను పరిరక్షించడంతో పాటు ఘట్‌కేసర్‌లోని రైల్వేవంతెన నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలని తెలుగుదేశం పార్టీ మండల నాయకులు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డు పంపారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు వేముల సంజీవ గౌడ్, సిస్టా సూర్యనారయణ మాట్లాడుతూ ఘట్‌కేసర్‌లోని గురుకుల్ విద్యాలయానికి చెందిన స్థలం ఆక్రమణలకు గురవుతుందని తెలిపారు. ఈ విద్యాలయానికి నగరంలోని హైటెక్ సిటీ, కొండాపూర్ ప్రాంతాల్లో దాదాపు 627 ఎకరాల భూమి ఉన్నప్పటికీ ఇక్కడ మాత్రం కనీస సౌకర్యాలు లేవని గుర్తు చేశారు. అలాగే ఘట్‌కేసర్‌లోని కొండాపూర్ రైల్వే వంతెన నిర్మాణ పనులు ఏళ్ల పాటు కొనసాగుతుండటం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఇప్పటికైన పై సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని కోరారు.

పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాల ప్రతిష్ఠ



దండుమైలారంలో పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమంలో జనార్దన్‌రెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): దండుమైలారంలోని ప్రాచీన శివాలమంలో పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు రావినూతల వంశీధర్, ఆలయ రాజపోషకులు తాడూరి జనార్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మహోత్సవం జరిగింది. మహాగణపతి పూజ, అఖండ దీపారాధన, పుణ్యాహావచనం, రుద్రాభిషేకం, పూర్ణాహుతి, ఉత్సవమూర్తుల ప్రతిష్ఠ, మహా మంగళహారతి కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో చిలకమర్రి లక్ష్మీనాథాచార్యులు, చక్రవర్తుల మదన్మోహనాచార్యులు, ప్రవచనకర్త కవీంద్రాచార్యులు, రావినూతల శ్రవణ్‌కుమార్, రోహిత్‌కుమార్, తాడూరి వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లప్పగుట్ట మల్లికార్జునస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం తలకొండపల్లి మండలం చెన్నారం మల్లప్పగుట్టపై వెలసిన మల్లికార్జున స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయ నవమి వార్షికోత్సవం, బ్రహ్మోత్సవాల నేపథ్యంలో దేదీప్యమానంగా అలంకరించారు. సమీప ప్రాంతాల భక్తులు తరలొచ్చారు. ఉదయం సుప్రభాత సేవ,స్వామివారికి మేలుకొలుపు పాడారు. అర్చకుడు గోపాలకృష్ణశర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, రుద్రాభిషేకం, పాశుపత రుద్రహోమం, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కల్లు పెంటారెడ్డి, ఏమిరెడ్డి శేఖర్‌రెడ్డి, మాకం పాండయ్య, దామోదర్‌రెడ్డి, నారాయణరెడ్డి, మల్లారెడ్డి, బుచ్చిరెడ్డి, శివుడు, సుమతి, సులోచన, వసంత, అమృతమ్మ, సుగుణ, గీత, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు

కడ్తాల్: మర్రిపల్లి సత్యఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల వేడుకల నేపథ్యంలో ఆలయాన్ని అలంకరించారు. తొలిరోజు గణపతి పూజ, ధ్వజస్తంభ, జలాదివాసం, ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆలయ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.



తలకొండపల్లి: చెన్నారంలో హోమం చేస్తున్న నాయకులు, భక్తులు

రాంనుంతలలో శివకోటి యజ్ఞం

ఆమనగల్లు: రాంనుంతల సమీపంలోని అయ్యసాగర క్షేత్రంలో త్రిపురాంతకేశ్వర వీరభద్రస్వామి, భద్రకాళి, సరస్వతి, శ్రీరామాంజనేయ ఆలయాల్లో సోమవారం శివరాత్రి బ్రహ్మోత్సవాలు, శివకోటి జపయజ్ఞం ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల ప్రారంభ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల భక్తులు తరలొచ్చారు. సుప్రభాత సేవ అనంతరం విఘ్నేశ్వర పూజ, అభిషేకాలు, సర్వదేవతపూజలు, భగద్గీత పారాయణయాలు, నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు భట్టు నర్సిరెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, ఎన్టీ.పంచాక్షరి, రామరెడ్డి, వీరయ్య, యాదయ్య, యాదగిరిరెడ్డి, శ్రీను, పంతూనాయక్, వైద్యనాథ్, చంద్రశేఖర్‌రెడ్డి, మల్లప్ప, యాదిలాల్, సురేశ్ పాల్గొన్నారు.

సన్మార్గంతో దైవానుగ్రహం

ఆమనగల్లు: సన్మార్గంతో సాగేవారు దైవానుగ్రహం పొందుతారని మాజీ జడ్పీటీసీ శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దైవ కార్యక్రమాల్లో ప్రతొక్కరు పాలు పంచుకోవాలని కోరారు. ఆకుతోటపల్లి శివాలయంలో శివస్వాముల ఇరుముడి కార్యక్రమం, హోమం, పూజలు నిర్వహించారు. శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శివస్వాములు ఆయనను సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జంగారెడ్డి, శివ స్వాములు పాల్గొన్నారు.



కడ్తాల్: పూజల్లో పాల్గొన్న భక్తులు



ఆమనగల్లు: హోమంలో శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి



ఆమనగల్లు : అయ్యసాగర్‌లో యజ్ఞంలో భక్తులు

క్రైం కార్నర్

పొలంలోకి దూసుకెళ్లి కారు బోల్తా



వరి పొలంలో బోల్తా పడిన కారు

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వేగంగా వచ్చిన కారు అదుపుతప్పి వరి పొలంలోకి వెళ్లి బోల్తాపడిన ఘటన ఆదివారం రాత్రి కడియాలకుంటతండా శివారులో చోటుచేసుకుంది. తాండ శివారులో చోటు చేసుకుంది. తండా వాసులు తెలిపిన వివరాల ప్రకారం.. కారు(టీఎస్07 బి2490)లో రాత్రి 10గంటల సమయంలో ఇద్దరు యువకులు బూర్గుల నుంచి తండావైపు వస్తుండగా ఆలయం వద్ద ఉన్న మలుపు వద్ద కారు అదుపు తప్పి వరి పొలంలో బోల్తాపడింది. బురదలో పండటంతో ఎలాంటి గాయాలు కాలేదు. అదే రాత్రి కారులోని వారు వెళ్లిపోయారు. సోమవారం ఎక్స్‌కవేటర్‌తో కారును బయటికి తీశారు.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం



అదృశ్యమైన మంజుల

కడ్తాల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యమైంది. కడ్తాల మండలం వంపుగూడలో ఈ సంఘటన చోటు చేసుకుంది. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. తలకొండపల్లి మండలం పడకల్‌కు చెందిన చౌటి మంజులకు కడ్తాల మండలం వంపుగూడకు చెందిన పోతుగంటి శేఖర్‌తో 15ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ముగ్గురు ఆడ పిల్లలు, ఒక కుమారుడు ఉన్నాడు. సంవత్సర కాలంగా శేఖర్ మద్యానికి అలవాటు పడి మంజులను వేధిస్తున్నాడు. పెద్దలు నచ్చజెప్పినా శేఖర్ ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో భర్త వేధింపులు తట్టుకోలేక మంజుల ఈ నెల 22న తన ఏడెళ్ల కూతురు, ఆరేళ్ల కుమారుడితో ఆమనగల్లు చదువుతున్న కూతుళ్ల వద్దకు వెళ్తానని చెప్పి వెళ్లింది. పిల్లలకు తన బాధను చెప్పగా అమ్మమ్మ ఇంటికి వెళ్దామని అన్నారు. వారు అటు పుట్టింటికి, ఇటు అత్తగారింటికీ చేరలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. మంజుల సోదరుడు అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివప్రసాద్ వివరించారు.

వ్యక్తి అదృశ్యం



అంజయ్య

కందుకూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సైదులు తెలిపిన వివరాల మేరకు.. యాచారం మండలం కుర్మిద్దకు చెందిన మార్చ అంజయ్య(50) కొన్నేళ్లుగా కందుకూరులో స్థిరపడ్డాడు. ఈ నెల 21న కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా అతడి ఆచూకీ దొరకలేదు. దీంతో సోమవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. అంజయ్య ఆచూకీ తెలిసివారు 8712662410/8712662369/8712662687 నంబర్లలో సమాచారమివ్వాలని కోరారు.

మెడలోని గొలుసు తెంపిన వ్యక్తికి దేహశుద్ధి



గ్రామస్తుల చేతిలో మురళి

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో నుంచి పుస్తెల తాడును తెంపుకొని పారిపోతున్న దొంగను పట్టుకొని గ్రామస్తులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కొత్తపల్లికి చెందిన కలివేముల సులోచన సోమవారం తన కల్లు దుకాణంలో ఒంటరిగా ఉన్నది చూసిన దొంగ ఆమె మెడలోని పుస్తెలతాడును తెంపుకొని పారిపోతున్నాడు. సులోచన అరవంతో చుట్టుపక్కల వారు దొంగను పట్టుకొని 3.5తులాల బంగారు పుస్తెలతాడును స్వాధీనం చేసుకున్నారు. దొంగను శంకర్‌పల్లి పోలీసులకు అప్పగించారు. నిందితుడు చేవెళ్ల మండలం తలారానికి చెందిన ఖానాపురం మురళిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగింత

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): టెంట్ హౌజ్ గోదాంలో సామాన్లను దొంగిలించి పారిపోతున్న దొంగలను కాలనీ వాసులు పట్టుకొని పోలీసుకు అప్పగించారు. పట్టణంలోని కిషన్‌నగర్ రోడ్డులో మాతా టెంట్ హౌజ్ గోదాం ఉంది. సోమవారం తెల్లవారు జామున ముగ్గురు గోడ దూకి అందులోకి ప్రవేశించారు. బోరు మోటార్లు, టెంట్ హౌజ్ వస్తువులు సంచుల్లో నింపుకుని పారిపోతున్నారు. గమనించిన కాలనీ వాసులు వెంబడించి పట్టుకున్నారు. డయల్ 100కు ఫోన్‌చేయగా పోలీసులొచ్చి ఒకరిని పట్టుకెళ్లారు. ఇద్దరు పరారయ్యారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతిని మోసగించిన వ్యక్తికి 20ఏళ్ల జైలు

కందుకూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి):పెళ్లి చేసుకుంటానని యువతిని మోసగించిన వ్యక్తికి 20ఏళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా కోర్టు జడ్జి సోమవారం తీర్పు ఇచ్చారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పులిమామిడికి చెందిన తిమ్మగళ్ల శ్రీనాథ్(21) గ్రామానికి చెందిన ఓ యువతిని నమ్మించి మోసం చేశాడు. పెళ్లి చేసుకోను అని చెప్పేశాడు. తనకు జరిగిన అన్యాయంపై 2017లో యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ కె.విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన జడ్జి శ్రీనాథ్‌కు 20ఏళ్ల జైలు, రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. బాధితురాలికి తక్షణమే రూ.3లక్షల పరిహారమివ్వాలని ప్రభుత్వానికి సూచించారు.

చోరీ కేసుల్లో నిందితుడి విచారణ

మొయినాబాద్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రెండు ఇంజినీరంగ్ కళాశాలల్లో చోరీ చేసిన నిందితుడు మరో కేసులో పట్టుబడి జైలుకెళ్లాడు. ఆ నిందితుడిని పోలీసులు రెండు రోజులు కస్టడీకి తీసుకొని విచారణ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బత్తుల ప్రభాకర్ అలియాస్ బిట్టు/హరీశ్ మొయినాబాద్ పరిధి కేజీరెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్‌లో గత డిసెంబరు 7న లాకర్లోని రూ.7.8లక్షలు ఎత్తుకుపోయాడు. జనవరి 8న రాత్రి అజీజ్‌నగర్ చౌరస్తాలోని వీజేఐఈటీ కాలేజీ లాకర్‌లో రూ.15.24లక్షలు చోరీ చేశాడు. పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్న ప్రభాకర్ ఇటీవల హైదరాబాద్ గచ్చిబౌలీలో కాల్పుల కేసులో అరెస్టయ్యాడు. జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న అతడిని మొయినాబాద్ పోలీసులు ఈ నెల 22న కస్టడీకి తీసుకొని విచారణ చేశారు. సీఐ పవన్‌కుమార్‌రెడ్డి, డీఐ రమేష్‌నాయుడు నిందితుడితో కాలేజీల వద్ద సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేయించారు. సోమవారం కోర్టులో హాజరుపర్చారు. అక్కడి నుంచి జర్లపల్లి జైలుకు తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మొయినాబాద్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి తీవ్ర గాయాలతో చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డిపల్లికి చెందిన బసగల్ల యాదయ్య(46) ఈ నెల 19న రాత్రి 10:30 సమయంలో నిద్రమత్తులో లేచి నీళ్లు తాగేందుకు ఫ్రిడ్జి వద్దకు వెళ్లి వెనుక ఉన్న సర్క్యూట్ రాడ్డు లాగాడు. దీంతో ఫ్రిడ్జి అతడిపై పడి మర్మావయాలకు గాయాలయ్యాయి. కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 23న రాత్రి మృతిచెందాడు. యాదయ్యకు భార్య మంజుల, ఇద్దరు కుమారులున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కారు దగ్ధం

మొయినాబాద్: ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి):షార్ట్‌సర్క్యూట్‌తో కారు దగ్ధమైన ఘటన ఆదివారం రాత్రి మొయినాబాద్ పోలీసుస్టేషన్ వద్ద చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన రాహుల్ కారులో ఆదివారం రాత్రి చేవెళ్ల వైపునుంచి హైదరాబాద్ వెళ్తున్నాడు. మొయినాబాద్ పీఎస్ ముందున్న బస్‌స్టాప్ వద్దకు రాగానే షార్ట్ సర్క్యూట్‌తో మంటలు లేచాయి. రాహుల్ మంటలార్పేలోపే వైరింగ్ కాలిపోయింది.

డీజే సీజ్.. కేసు నమోదు

కడ్తాల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండ డీజేను ఏర్పాటు చేసుకున్న పెళ్లి నిర్వాహకులపై, డీజే యజమానిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు. కొండ్రిగాని బోడుతండాకు చెందిన ముఖేశ్ పెళ్లి సందర్భంగా ఆదివారం రాత్రి డీజేను ఏర్పాటు చేశాడు. ఇతరులకు ఇబ్బంది కల్గించడంతో 100 నంబర్‌కు స్థానికులు డయల్ చేశారు. వెంటనే పోలీసులు చేరుకొని డీజే, సౌండ్ బాక్సులు, ఇతర సామగ్రిని సీజ్ చేశారు.

లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలి



ముచ్చర్ల సబ్‌స్టేషన్ వద్ద సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న రైతులు

కందుకూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లోవోల్టేజీ సమస్యను పరిష్కరించి రైతులకు 24 గంటల విద్యుత్‌ను సరఫరా చేయాలని ముచ్చర్లలోని సబ్‌స్టేషన్ వద్ద రైతులు, గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్‌స్టేషన్ సిబ్బంది బాలాజీకి వినతిపత్రం ఇచ్చారు. వేసవి రాకమందే లోవోల్టేజీతో ఇండ్లలో ఫ్యాన్‌లు, లైట్లు కాలిపోతున్నాయని రైతులు వాపోయారు. పొలాల వద్ద మోటర్లు, స్టార్టర్లు కాలిపోతున్నట్టు చెప్పారు. ప్రభుత్వం, విద్యుత్ అధికారులు స్పందించి లోవోల్టేజీ విద్యుత్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు గడ్డం మహిపాల్‌రెడ్డి, బండ నరసింహ, కాస నరసింహ, ఎం.రాజు, బి.బిక్షపతి, టి.రాజు, కె.జంగయ్య, ఇ.దామోదర్‌రెడ్డి, గ్రామస్తులు బి.నరసింహ, జి.సత్యం, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

భారతీయ కిసాన్ సంఘ్ నాయకుడు సాయిరెడ్డికి ఘన స్వాగతం



విమానాశ్రయం వద్ద సాయిరెడ్డికి స్వాగతం పలుకుతున్న సంఘం నాయకులు

షాబాద్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికై శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న కొండల సాయిరెడ్డి, సంఘటన్ మంత్రి మాదిరెడ్డి రాజిరెడ్డిలకు రాష్ట్ర బీకేఎస్ నాయకులు సోమవారం స్వాగతం పలికారు. సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సాయిరెడ్డి జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికవడం హర్షించదగ్గ విషయమైని నాయకులు అన్నారు. రైతుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ వాటి పరిష్కారానికి భారతీయ కిసాన్ సంఘ్ ముందుంటుందని సాయిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయకార్యదర్శి సత్యనారాయణరెడ్డి, కందాడ గ్రామ కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కార్యదర్శి విశ్వనాథం ఉన్నారు.

సైన్స్ టీచర్‌ను నియమించాలని కలెక్టర్‌కు వినతి



మహేశ్వరం, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): తుమ్మలూరు ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ టీచర్‌ను నియమించాలని గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రమిచ్చారు. సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

పొలాలకు రోడ్డు మార్గం



రోడ్డు సౌకర్యంతో హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధి కేబీ దొడ్డి రెవెన్యూలోని 15 మంది రైతులు పొలాలకు వెళ్లేందుకు దారి లేక ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ దండు ఇస్తారి భూ యజమానులతో చర్చించి పొలాలకు వెళ్లేందుకు రోడ్డు సమస్యను పరిష్కరించారు. రైతులు మాజీ సర్పంచ్‌కి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభాకర్‌గౌడ్, మల్లికార్జున్, నసీరుద్దీన్, సిద్ధయ్య, శ్రీశైలం, మొయినుద్దీన్, మునీర్, గోపాల్, శివకుమార్, అంజయ్య, జంగయ్య పాల్గొన్నారు.

'రెండు గ్రామాలను చేవెళ్ల మున్సిపాలిటీలో కలపొద్దు'

చేవెళ్ల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి):చేవెళ్ల మున్సిపాలిటీలో పలుగుట్ట, కందవాడ పంచాయతీలను కలపొద్దని గ్రామస్తులు సోమవారం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. మాజీ సర్పంచ్ నర్సింలు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, మల్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ.. తమ పంచాయతీలను చేవెళ్ల మున్సిపాలిటీలో కలపొద్దని కలెక్టర్‌కు, రాష్ట్ర మున్సిపల్ కమిషనర్, పంచాయతీరాజ్ కమిషనర్‌లకు సైతం వినతి పత్రాలిచ్చామన్నారు. పలుగుట్ట, కందవాడ గ్రామాల ప్రజల అభిప్రాయం మేరకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, రవీందర్, మల్లేష్, అరుణ్‌కుమార్, సత్తయ్య, కుమార్, మధుసూదన్‌రెడ్డి, శ్రీశైలం, వెంకటేశ్, కిరణ్ రెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంఘం జిల్లా కార్యదర్శికి సన్మానం

శంషాబాద్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శిగా నియమితులైన నర్రా గిరిని సోమవారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు ఆధ్వర్యంలో కార్మికులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గిరి మాట్లాడుతూ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విగ్రహం తొలగింపుపై నిరసన

కడ్తాల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): చిన్నవేములోని బావి తండాలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని తొలగించిన రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థపై చర్యలు తీసుకోవాలని బీజేపీ, వీరాంజనేయస్వామి భక్త బృందం కోరింది. సోమవారం ఆంజనేయస్వామి ఆలయం వద్ద నిరసన చేశారు. 22న బావి తండాలో ఆంజనేయ స్వామి విగ్రహాన్ని తొలగించిన రియల్ ఎస్టేట్ సంస్థపై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. 48గంటలు గడచినా విచారణ చేయకుండా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విగ్రహాన్ని కడ్తాల ఆంజనేయస్వామి ఆలయంలో ఉంచి పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దోనాదుల మహేశ్, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శంకర్‌నాయక్, పత్యానాయక్, మునేశ్, వినోద్, అఖిల్, లాలు, రాజు, దశరథ్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

చౌదరిగూడ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వలస నివారణకు చేపడుతున్న ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని టీఏ వినోద్ అన్నారు. సోమవారం మండల పరిధి తుమ్మలపల్లిలో ఉపాధి హామీ పనులు ప్రారంభమయ్యాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీలో గుర్తించిన పనులను చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు మల్లయ్య, రంగయ్య, సత్తయ్య, ప్రభుదాస్, యాదయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

అంబులెన్స్‌ల తనిఖీ

షాద్‌నగర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అంబులెన్స్ వాహనాలను అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. సోమవారం షాద్‌నగర్‌లో ఖాళీగా తిరుగుతున్న వాహనాలను అంబులెన్స్ ప్రధాన కార్యాలయం అధికారులు పకీర్‌దాస్, రాజబాబు ఆపి తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో అమర్చిన వైద్యపరికరాలు సక్రమంగా ఉన్నాయా? వాటి పనితీరు, అనారోగ్యులను చేరవేస్తున్న వారి సంఖ్య తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యుల తరలింపులో ఎలాంటి జాప్యం చేయరాదని డ్రైవర్లను ఆదేశించారు.

యాచారం ఇన్‌స్పెక్టర్ బదిలీ

యాచారం, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి):యాచారం పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ.నర్సింహారావును బదిలీ చేస్తూ సోమవారం రాచకొండ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనను మల్కాజ్‌గిరి సీసీ ఎస్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో మల్కాజ్‌గిరి సీసీఎస్‌లో పనిచేస్తున్న ఎ.నందీశ్వర్‌రెడ్డిని నియమించారు. ఇటీవల మాల్‌లో 70ఏళ్ల వృద్ధురాలిపై జరిగిన అత్యాచారయత్నం ఘటనపై పత్రికల్లో వచ్చిన కథనాలతో ఇంటలిజెన్స్ ఉన్నతాధికారులు ప్రస్తుత సీఐని బదిలీ చేసినట్టు తెలుస్తోంది.

ఆలయ ప్రారంభ ఏర్పాట్ల పరిశీలన

తలకొండపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తలకొండపల్లిలోని నర్సింహస్వామి గుట్ట వద్ద పునరుద్ధరించిన శివాలయ ప్రారంభ ఏర్పాట్లను సోమవారం మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ పరిశీలించారు. ఈ నెల 26న ఆలయాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ప్రారంభోత్సవానికి హాజరయ్యే నాగాసాధువులు హైదరాబాద్ చేరుకున్నారు. వారికి వెంకటేశ్ స్వాగతం పలికారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని యు.మంజుల-వెంకటేశ్ కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్, మాజీ సర్పంచ్‌లు గోపాల్, లలితజ్యోతయ్య, చారిటబుల్ ట్రస్ట్ మెంబర్లు అనిల్, అఖిల్ తదితరులు ఉన్నారు.

కోర్టు పరిధి భూములపై రగడ

నందిగామ, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి):కోర్టుల పరిధిలో ఉన్న భూమిపై వెంచర్ నిర్వాహకులు, రైతుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. నందిగామ మండలం రంగాపూర్‌లో సర్వే నంబర్ 320, ఇతర సర్వే నంబర్లలో 110 ఎకరాల్లో పదేళ్ల కింద వెంచర్ ఏర్పాటు చేశారు. 325 సర్వే నంబర్‌లోనూ కొంత ఉందని వెంచర్ నిర్వాహకులు ఘర్షణలకు దిగుతూ హైకోర్టు నుంచి ఇన్‌జంక్షన్ ఆర్డర్ పొందారు. రైతు హనుమంతరావు కూడా 2019లో హైకోర్టును ఆశ్రయించారు. ఇన్‌జంక్షన్ ఆర్డర్‌తో వెంచర్ నిర్వాహకులు తమపై దౌర్జన్యం చేస్తూ ప్రీకాస్ట్ ప్రహరీని, భూమి ఫెన్సింగ్ ధ్వంసం చేశారని రైతు ఆరోపించారు. ఇన్‌జంక్షన్ ఆర్డర్ ప్రకారమే తాము నడుచుకున్నామని, దౌర్జన్యాలు చేయలేదని రియల్టర్లు అంటున్నారు.

సంక్షిప్తంగా

● **తలకొండపల్లి:** మండల కేంద్రానికి చెందిన ముత్యాలు ఇటీవల మృతి చెందాడు. అతడి కుటుంబాన్ని సోమవారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. పార్టీ తరఫున రూ.3వేల సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో పీసీసీ కిసాన్ సెల్ కార్యదర్శి మోహన్‌రెడ్డి, అజీం, రవీందర్ యాదవ్, రామ్మోహన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, నర్సింహ, ఆంజనేయులు, శ్రీనివాస్, గణేశ్, గిరిధర్ రెడ్డి, శేఖర్, జంగయ్య, అంజిరెడ్డి ఉన్నారు.

● **చేవెళ్ల:** ప్రతొక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని చేవెళ్ల ఏపీఎం శోభరాణి తెలిపారు. మండల సమాఖ్య కార్యాలయంలో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఆహారం తీసుకోవాలన్నారు. రోజూ గుడ్లు, ఆకుకూరలు తినాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య ఉద్యోగులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

● **మంచాల:** ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన 19వ విడదల నిధులు విడుదలయ్యాయని ఇబ్రహీంపట్నం ఏడీఏ సుజాత తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ పీఎం కిసాన్ సమ్మాన్ నిధుల విడుదల కార్యక్రమాన్ని సోమవారం బీహార్‌లో ప్రారంభించారు. మంచాల రైతు వేదికలో రైతులు ప్రత్యక్ష ప్రసారం వీక్షించారు. ఏడీఏ మాట్లాడుతూ 2019 ఫిబ్రవరి 1వ తేదీలోపు పట్టాదారు పాసుబుక్కులు కలిగి ఉన్న రైతులందరికీ 19వ విడత పీఎం కేఎస్‌పై డబ్బులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు చంద్రకాంత్, కృష్ణ, విజయ్‌కుమార్, దిలీప్, ఏఈవోలు సాయిసిరి, సాయివాణి, లింగస్వామి, వాటర్‌షెడ్ ప్రతినిధి కృష్ణ పాల్గొన్నారు.

● **కందుకూరు:** ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులను విడుదల చేసి, గుడ్డు ధరను పెంచాలని సీఐటీయూ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నాకు మండల కేంద్రం నుండి తరలివెల్లారు. ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10వ తరగతి విద్యార్థులకు భోజనం వండుతున్న కార్మికుల బిల్లులు విడుదల చేయకపోవడం సరికాదన్నారు. వారు అప్పులపాలయ్యారని అన్నారు. మార్కెట్‌లో కోడి గుడ్డుకు 7.8రూపాలయు ఉంటే ప్రభుత్వం రూ.5 రూపాయలే ఇస్తోందన్నారు. భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో భోజన కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు ప్రభావతి, అశ్విని, గీత, బాలమణి, లక్ష్మమ్మ, కృష్ణవేణి, స్వప్న పాల్గొన్నారు.

● **యాచారం:** పరీక్షల వేళ విద్యార్థులు మొబైల్ వాడొద్దని రాచకొండ కమిషనరేట్ షీ టీం అధికారి ఎల్లమ్మ సూచించారు. కుర్మిద్ద ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. సామాజిక మాధ్యమాల్లో చాటింగ్ చేయొద్దని, రీల్స్ మానుకోవాలని చెప్పారు. వీడియోలు మార్ఫ్ చేసి ఎవరైనా వేధిస్తే 100కాల్ చేసి చెబితే చర్యలు తీసుకుంటామన్నారు. ఆడ పిల్లల భద్రత విషయంలో తాము కఠినంగా వ్యవహరిస్తామన్నారు. విద్యార్థులు కరాటే నేర్చుకోవాలని, ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పాండురంగారెడ్డి, టీచర్లు శ్రీనివాస్, స్వప్న, అశోక్, వీరమణి, శ్రీదేవి తదితరులు ఉన్నారు.

● **కేశంపేట:** వేముల్‌నర్వ జీమ్స్ ఆసుపత్రి, మైత్రి యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. పంచాయతీ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 213మందికి పరీక్షలు నిర్వహించి చేసి మందులు ఇచ్చారు. 13మందికి చికిత్సలు అవసరమని గుర్తించి వారిని ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో జీమ్స్ వైద్యులు రఘురామ్, మృదుల, సల్మాన్, సురేష్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి ప్రసన్నలక్ష్మి, మైత్రి యువజన సంఘం అధ్యక్షుడు మనోహర్‌గౌడ్, మల్లేష్, ఆనంద్, కార్తీక్, రాఘవేందర్, నవీన్, రామచందర్ పాల్గొన్నారు.

ఉద్యాన శాఖలో ఉద్యోగులేరి?

(ఐదో పేజీ తరువాయి)

చేసుకున్న రైతులు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. సాగు విస్తీర్ణం పెరగాలంటే రైతులకు సలహాలు, సూచనలు అందించాల్సి ఉంటుంది. కానీ.. ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖలో అధికారుల నియామకం చేపట్టక ఆ దిశగా చర్యలు తీసుకునేవారే లేరు. జిల్లాలోని ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖలో 38 పోస్టులకు ఎనిమిది మందే ఉద్యోగ, సిబ్బంది పనిచేస్తున్నారు. 30 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వ్యవసాయ శాఖ మాదిరిగానే మండలానికి ఒక ఉద్యాన శాఖ అధికారితో పాటు ఇద్దరు, ముగ్గురు ఫీల్డ్ కన్సల్టెంట్లు పనిచేయాల్సిన అవసరముంది. ఉన్న పోస్టులను భర్తీ చేయక, కొత్త ఏర్పాటు చేయక ఉద్యానశాఖ ఖాళీగా ఉంది. గతంకంటే ఇప్పుడు ఉద్యానశాఖ సేవలు రైతులకు ఎక్కువగా అవసరమున్నాయి. రైతులు ఆధార ధాన్యాలతో పాటు ఉద్యానశాఖ పరిధిలోకి వచ్చే పంటలను సాగు చేసే ఆలోచనలో ఉన్నారు. సబ్సిడీ పరికరాలు కూడా ఉద్యానశాఖ పరిధిలోనే ఉండటంతో ఉద్యోగుల సేవలు ఎక్కువ అవసరముంటుంది. ప్రభుత్వం ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు.

సాగువుతున్న ఉద్యాన పంటల వివరాలు

పంట పేరు	వానాకాలం	యాసంగి	మొత్తం	ఉత్పత్తి(మె.టన్నులు)
పండ్లు	29,412	84	29,496	1,63,199
కూరగాయలు	15,712	18,399	34,111	3,16,614
పువ్వులు	3,108	2,717	5,825	39,038
సుగంధ ద్రవ్యాలు	673	241	914	2,663
ఆగ్రో ఫారెస్ట్రీ	1,983	0	1,983	0
పట్టు పరిశ్రమ	167	0	167	0
మొత్తం	51,055	21,441	72,496	5,21,514

రైతులకు సలహాలు ఇచ్చేవారు కరువు..

రైతులకు సబ్సిడీపై కూరగాయ విత్తనాలు అందించడం, డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేయించడం, మామిడి, అరటి, బొప్పాయి, నారింజ, జామ, దానిమ్మ తదితర పండ్ల తోటలపై పెంచేందుకు రైతులను ప్రోత్సహించాల్సి ఉంది. సాగులో మెళకువలను రైతులకు ఉద్యాన శాఖ అధికారులు తెలియజేయాల్సి ఉంది. కొంతమంది రైతులు ఉద్యాన, పట్టు పరిశ్రమను ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నప్పటికీ వారికి ప్రోత్సాహం కరువైంది.

క్షేత్రస్థాయిలోనలుగురే!

జిల్లాలో ఐదు రెవె న్యూ డివిజన్లు, 27 మండలాలున్నాయి. మండలానికో హార్టికల్చర్, పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఉండాలి. కానీ.. ఈ రెండు శాఖలు చూసుకునేందుకు క్షేత్రస్థాయిలో నలుగురు ఉద్యోగులే ఉన్నారు. ఐదుగురు జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్నారు. ఇబ్రహీంపట్నం, యాచారం, బాలాపూర్, అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, మాడ్గుల, మంచాల మండలాలకు ఉద్యానవన శాఖ అధికారి నవీన, చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, షాబాద్, శేరిలింగంపల్లి, గండిపేట మండలాలకు ఉద్యానశాఖ అధికారి కీర్తికృష్ణ, ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మహేశ్వరం, కందుకూరు, శంషాబాద్, రాజేంద్రనగర్‌కు సౌమ్య, షాద్‌నగర్, కేశంపేట్, కొత్తూరు, నందిగామ, చౌదరిగూడెం, కొందుర్గు మండలాలకు హిమబిందు ఉన్నారు. ఒక్కొక్కరికి ఏడెనిమిది మండలాలున్నాయి.

వ్యవసాయశాఖలో విలీనానికి డిమాండ్

ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖను వ్యవసాయ శాఖలో విలీనం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కూరగాయ పంటలు, పట్టు పరిశ్రమను పెట్టుకుంటే సూచనలిచ్చే వారు లేరని అంటున్నారు.

వాట్సాప్ ద్వారా సూచనలిస్తున్నాం

సిబ్బంది కొరతతో రైతులకు వాట్సాప్ గ్రూపుల్లో సూచనలిస్తున్నాం. ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖలో సిబ్బంది నియామకానికి ఉన్నతాధికారులకు నివేదించాం. సమస్యలపై రైతులు ఫోన్ చేస్తున్నారు.

- సురేష్, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖాధికారి